3నుంచి రైతు సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

ఆధునిక వ్యవసాయంపై గుంటూరులో డిసెంబర్ 3,4,5 తేదీల్లో జరుగు రైతు సదస్సుకు ఆసక్తి గల రైతులు తరలి రావాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ టిఎన్ఎస్కె పాత్రో అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతు సదస్సు నిర్వహిస్తుందన్నారు. పంటల సాగు వివరాలు, ఉత్పత్తి, సస్యరక్షణలో ఆధునిక విధానాలు, వ్యవసాయ యాంత్రీకరణ, ఆహార ఉత్పత్తుల తయారీలో వినూత్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు, మారుతున్న కాలాన్ని బట్టి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నూతన పద్ధతులపై రైతులు పలు అంశాలను నేర్చుకోవచ్చన్నారు. కావున ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంకా ఏమైనా సందేశాలుంటే కెవికె సిబ్బందికి సంప్రదించాలని కోరారు.

నేత్ర రోగులకు వరం...

జిల్లా కేంద్రాసుపత్రి నేత్రవైద్య విభాగం అవగాహన కల్పిస్తే సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో నేత్రవైద్య విభాగానికి రోజురోజుకు ఎనలేని ఆదరణ లభిస్తోంది. గతంలో నేత్రవైద్యానికి సంబంధించిన ఆపరేషన్లు, చికిత్సల కోసం విజయనగరం, విశాఖపట్నంలో గల ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు పూర్తిస్థాయిలో కేంద్రాసుపత్రిలో వైద్యుల నియామకం జరగడంతో పాటుగా అందుకు సంబంధించిన పరికరాలు, ఆపరేషన్ థియేటర్, యంత్ర పరికరాలు ఏర్పాటు కావడంతో, రోజురోజు నేత్రవ్యాధులకు సంబంధించిన రోగులు ఓపిలో పరీక్షలు చేయించుకునేందుకు ఎక్కువగా తరలివస్తున్నారు. కంటి అపరేషన్లు కూడా పార్వతీపురం కేంద్రాసుపత్రిలో చేయించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని స్థానిక వైద్యులు తెలియజేస్తున్నారు. ప్రతి రోజు ఓపి విభాగంలో ఆధునిక యంత్రాలతో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. గ్లూకోమా, కాటరాక్ట్‌తో చిన్న, చిన్న మైనర్ ఆపరేషన్లు నిర్వహించడం, నీటికాసులు, కంటిపొరలు, రెప్పల్లో చీము వంటి సమస్యలతో ఎక్కువగా రోగులు వస్తున్నారని, వీరికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ ఆసుపత్రిలో ఈ విభాగం ఏర్పాటైందని తెలియక ఇప్పటికీ పరిసర ప్రాంత ప్రజలు ప్రైవేటు కంటి ఆసుపత్రి వారు నిర్వహించే క్యాంపులకు హాజరై ఆయా అసుపత్రలకు తరలివెళుతున్నారని, దీనిపై విస్తృతంగా ప్రచారం జరగాలని ఆసుపత్రి వైద్యులు కోరుతున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నవారికి, ఇహెచ్ఎస్ వారికి కూడా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ విభాగంలో నేత్ర వైద్యం కోసం వచ్చే వారు తమతో పాటు తప్పక ఆధార్‌కార్డును తీసుకురావాలని కోరారు.

నేత్ర శస్త్రచికిత్స చేస్తున్నవైద్యులు (ఫైల్)

ఉచితంగానే ఆధునిక నేత్రవైద్యం

పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో నేత్రవైద్య విభాగానికి రోజురోజు ఆదరణ పెరుగుతుంది. అందుకు కారణం ఇక్కడ విలువైన నేత్ర పరీక్షలతో పాటు, స్థానికంగానే ఆపరేషన్లు కూడా నిర్వహించడమే. గిరిజన గ్రామ ప్రాంతాల వారు కంటి సమస్యలతో ఎక్కువగా వస్తున్నారు. వీరికి విలువైన సేవలు స్థానికంగానే అందడంతో రోగుల సంఖ్య పెరగడానికి కారణం.

కె.సుకుమార్ బాబు,
జిల్లా అంధత్వ నివారణ ప్రాజెక్టు అధికారి.

ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్ కార్డులు ఉన్న వారికి స్థానికంగానే శస్త్ర చికిత్సలు

ప్రైవేటు ఆసుపత్రుల్లో మాదిరిగానే జిల్లా ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా విలువైన కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. కళ్లద్దాల పంపిణీకి మరికొద్దిరోజులు పడుతుంది. ఆసుపత్రిలోని సేవలపై అవగాహన పెంచుకుని రోగులు సేవలు వినియోగించుకోవాలి.

కె.సూర్యమాల,
అప్తాలమాలజిస్టు, సివిల్‌సర్జన్.

వైఎస్సార్ కల్యాణమస్తు నాలుగో విడత నిధులు విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

వైఎస్సార్ కల్యాణమస్తు నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 697మంది దంపతులకు మంజూరైన రూ.4.95కోట్లు చెక్కును కలెక్టరు నిశాంత్ కుమార్ లబ్దిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కార్యాలయం నుంచి నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరు కార్యాలయం నుంచి జిల్లాకలెక్టరు నిశాంత్ కుమార్, అధికారులు, లబ్దిదారులు వర్చువల్‌గా హాజరయ్యారు. ముఖ్యమంత్రి మీటనొక్కి డబ్బులను నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి జమచేశారు. కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ బాల్యవివాహాలను నిరోధించేందుకు, మహిళలకు కనీస విద్యనందించేందుకు కల్యాణమస్తు కార్యక్రమం దోహదం చేస్తుందని తెలిపారు. పేదల తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు అమ్మఒడి, నాడు నేడు వంటి కార్యక్రమాలు, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించేందుకు ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కనీసం పదో తరగతి చదివి, వధువుకు 18 ఏళ్లు, వరునికి 21 ఏళ్లు నిండి వివాహం చేస్తుకున్న వధూవరులు వివాహమైన 30 రోజుల్లోపు తమ దగ్గర్లోని గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చునని తెలిపారు. రాష్ట్రంలోని మహిళలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి ఖాతాలోనూ, అదే కులంలో వివాహాలు చేసుకున్న వధువులకు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమ చేస్తోందని కలెక్టరు తెలిపారు. జిల్లాలో 697 దంపతుల్లో బిసిలకు చెంది అదే కులంలో వివాహం చేసుకున్నవారు 414, కులాంతర వివాహం చేస్తుకున్నవారు 13, వివాహం చేసుకున్న దివ్యాంగులు 9, షెడ్యూల్డు కులాలకు చెంది అదే కులంలో వివాహం చేసుకున్నవారు 94, కులాంతర వివాహం చేసుకున్నవారు 11, షెడ్యూల్డు జాతులకు చెంది అదేకులంలో వివాహం చేసుకున్న వారు 146, కులాంతం వివాహం చేసుకున్నవారు 10 మంది దంపతులకు నిధులు విడుదల చేశామన్నారు. పేద కుటుంబాల్లో వివాహాలకు ప్రభుత్వం వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకం ద్వారా అందిస్తున్న నిధులు తమ కుటుంబాలను చాలా ఆదుకుంటుందని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం కొత్త జీవితాన్ని ఆరంభించిన తమకు ఎంతో ఉపయోగకరమని సంతోషం వ్యక్తం చేశారు. కులాంతర వివాహం చేసుకున్న యువతకు ఇస్తున్న కల్యాణమస్తు నిధులు పెంచి అందించడం తమకు ఎంతో సంతోషంగా ఉందనిపట్టణానికి చెందిన బూరగాన గౌరీశంకర్, మెల్లిక హేమలత దంపతులు, బంద బంగారయ్య, దన్నాన సుశీల దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

డిప్యూటీ డిఇఒగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పాలకొండ

డిప్యూటీ డిఇఒగా పి.కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొండ ఎంఇఒగా పని చేస్తున్న కృష్ణమూర్తికి పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ నియమించారు.

10న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభ

విజయనగరం : డిసెంబర్10న రాష్ట్రస్థాయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రథమ మహాసభ విజయవాడలో జరగుతుందని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (అమరావతి జెఎసి) రాష్ట్ర అధ్యక్షులు సుమన్ తెలిపారు. గురువారం రెవెన్యూ కల్యాణ మండపంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ట్రయిల్ రన్‌ను నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

నెలాఖరులోగా సాలూరుకు రైలు బండి

ట్రయిల్ రన్ విజయవంతం

ప్రజాశక్తి - సాలూరు

ఈనెలాఖరులోగా సాలూరుకు రైలు బండి రానుంది. ఈ మేరకు రైల్వే అధికారులు బుధవారం రాత్రి బొబ్బిలి నుంచి రైలు బండిని ట్రయిల్ రన్ చేశారు. ఇది విజయవంతం కావడంతో వారం రోజుల్లో రైలు బండి నడపాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు. కొద్దినెలల క్రితం ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు సాలూరు రైలు మార్గం గుండా ప్రయాణించి బండి నడపడానికి అవకాశాలను పరిశీలించారు. దీనిలో భాగంగా ట్రయిల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. 8 బోగీలతో ఇఎంయు రైలు బండిని నడపనున్నారు. సాలూరు బొబ్బిలి మధ్య సుదీర్ఘ కాలం రైలు బస్సును రైల్వేశాఖ నడిపింది. రైలు బస్సు నిర్వహణకు అయ్యే ఖర్చులు కూడా రాకపోవడంతో అధికారులు బస్సుని నిలిపివేశారు. విజయనగరం, విశాఖపట్నం మధ్య నడిచే రైలు బండిని బొబ్బిలి మీదుగా సాలూరు వరకు నడపాలని నిర్ణయించారు. అయితే గతంలో రైలు బండి ఇక్కడ నుంచి బయలు దేరే సమయంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేకువ జామున 4.30 గంటలకు సాలూరు నుంచి బయలుదేరేలా సమయాన్ని నిర్ధేశించడంపై ఈ ప్రాంతవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నుంచి బయలు దేరే సమయం మార్చాలని కోరుతున్నారు.

వైసిపితోనే సామాజిక సాధికారత

సామాజిక సాధికార బస్సుయాత్రలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ముత్యాలు నాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

బిసిలు, ఎస్, ఎస్‌టిల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిన సామాజిక సాధికారత సాధిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్ర సభకు వచ్చిన జనాన్ని చూస్తే బొబ్బిలి విజయం వైసిపికే సొంతమని అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభ గురువారం సాయంత్రం శ్రీకళాభారతి జంక్షన్ లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని అన్నారు. 25 మంత్రి వర్గ స్థానాల్లో 17 వెనుకబడిన వారికి ఇచ్చారని చెప్పారు. మళ్లీ మోసపోకుండా రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు అమ్మఒడి అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ విద్యను ప్రభుత్వ విద్యా సంస్థలలో అందించేందుకు నాడు-నేడు అమలు చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజులు నియోజకవర్గానికి ఏమి చేశారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో రాజులు ఓటు కోసం వస్తే బుద్ధి చెప్పాలని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బొబ్బిలిని రెవెన్యూ డివిజన్ గా చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు 2014లో అమలు చేయకపోతే వైసిపి ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఇచ్చిందని చెప్పారు. చెరకు రైతులకు బకాయి బిల్లులు ఇప్పించిన ఘనత వైసిపిదేనని అన్నారు.

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం చేయూత, ఆసరా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రజలందరికీ వైద్యం అందించేందుకు వైద్య రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ గత పాలకుల పాలనలో బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని చెప్పారు. సభలో మాజీమంత్రి పి.పుష్పశ్రీవాణి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బడుకొండ అప్పలనాయుడు, అలజంగి జోగారావు, ఎస్‌టి కమిషన్ చైర్మన్ స్వాతీరాణి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ శాఖామంత్రి ముత్యాలునాయుడు

మహాధర్నాపై ప్రచారం చేస్తున్న నాయకులు రెడ్డి వేణు

27, 28 న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో తలపెట్టిన మహాధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి వేణు, పి.రాము మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ప్రచారం, సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కరించకుండా కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి ధరలను పెంచి, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్న బిజెపి విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని, ప్రజా పోరాటాలు, ప్రజాతంత్ర హక్కులపై దాడి ధర్నాలు నిరసనలపై నిర్బంధాన్ని ప్రజలంతా ఖండిస్తూ పోరాడాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జాతీయ కార్మిక, రైతు సంఘాలు ఈనెల 27, 28న విజయవాడ జింఖానా గ్రౌండ్లో మహాధర్నా చేపట్టాలని, ఈ ధర్నాలో రైతులు, కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు మతోన్మాద విచ్ఛిన్నకర చర్యలను ఖండించాలని, కార్మిక రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు మండలంలోని నర్సిపురం, వెంకంపేట, ములగ, బొండపల్లి తదితర గ్రామాల్లో, సమావేశాలు జరిపి ప్రజలు చలో విజయవాడకు రావాలని కోరారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పనుకువలస పరిధిలో గల భూములను తమ తాతల కాలం నుండి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూములకు సాగు హక్కు పట్టాలని ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యాన ఆ గ్రామ గిరిజనులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీసభ్యులు కె.ఈశ్వరరావు, గిరిజనులు సొండి సూర్యనారాయణ, రెయ్యి పెంటమ్మ, సొండి పోలమ్మ, పరమేశు, మర్రి శంకర్రావు, మజ్జి సొంబురు మాట్లాడుతూ గిరిజనులు తమ తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్న భూములకు నేటికీ హక్కులు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. సాలూరుకు చెందిన కొంతమంది వ్యక్తులు తమ భూములను కాజేయాలని చూస్తున్నారని, మాకు, మా భూములకు రక్షణ కల్పించి సాగు హక్కులు ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ భూములు సర్వేలు చేసి పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే భవిష్యత్ పోరాటాలకు అధికారులు, ప్రభుత్వమే బాధ్యత పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల భూములకు హక్కులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాముల సన్యాసి, బొడ్డ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

పేదలకు సాగుభూమి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

భూమిలేని పేద రైతులకు సాగు భూమిని కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం చినమేరంగి తన అతిథిగృహంలో నియోజకవర్గంలో గల ఐదు మండలాల్లో సాగు భూమిలేని 1070 మంది పేద రైతులకు 830 ఎకరాల డికెటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన పని చేస్తూ అర్హులకు అన్ని సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని అటువంటి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరమైన రాజకీయ బురద జల్లుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపిపిలు శెట్టి పద్మావతి, కుంబరిక దీనమయ్య, ఉరిటి రామారావు, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిషార్, ఐదు మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రూరల్ ఎస్ఐగా దినకర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక రూరల్ ఎస్సైగా దినకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించిన ఈయన, ఇప్పటి వరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన సింహాచలం పార్వతీపురం మన్యం డిసిఆర్‌బి ఎస్సైగా బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై దినకర్ మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతల పర్యవేక్షణకు నిరంతరం కృషి చేస్తానని, అందుకు అందరూ సహకరించాలని కోరారు.

25 నుంచి రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగంపేట బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో ఈనెల 25,26,27 వరకు 67వ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్టు పిఇటిలు డి.గాంధీ, ఎస్.మురళి తెలిపారు. ఈ పోటీల్లో 14, 17, 1ఏళ్ల బాలురు, బాలికలు పాల్గొనవచ్చునని వారు తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు నాణ్యత లోపంతో జరుగుతుండడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపడుతున్నట్టు అటు అధికారులు, పాలకులు చెబుతున్నా ఆచరణలో మాత్రం శూన్యమని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇందుకు నిదర్శనం ప్రధాన రహదారికి మధ్య నిర్మిస్తున్న డివైడర్ల నిర్మాణంలో అధికారులు నాణ్యతకు తిలోదకాలిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వట్టిగెడ్డ నుంచి స్థానిక విశాఖ గ్రామీణ బ్యాంకు వరకు నిర్మించిన డివైడర్ ఒకవైపు నిర్మిస్తుండగా, మరో వైపున పెచ్చులూడిపోతున్నాయి. వీటిని బయటకు కనబడనీయకుండా అప్పటికప్పుడు ప్లాస్టింగ్ చేస్తున్నారు. దీనంతటికీ అధికారుల పర్యవేక్షణా లోపమేనని స్థానికులు ఆరోపిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారులు వారికి ఇష్టమొచ్చినట్టు నాణ్యతాలోపంతో పనులు చేపడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పెచ్చులూడిపోయిన డివైడర్లు (వృత్తంలో...)



గ్రంథాలయానికి ప్రజాశక్తి పత్రికను అందజేస్తున్న జన్ని చింతాడ

గ్రంథాలయానికి 'ప్రజాశక్తి' పత్రిక వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకికి చెందిన జన్ని చింతాడ 'ప్రజాశక్తి' దినపత్రికను ఏడాది పాటు నేతాజీ గ్రంథాలయానికి వేసేందుకు వితరణగా ఆ చందాను గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్ నాయుడు మాట్లాడుతూ పేదవాడైన జన్ని చింతాడ విద్యార్థుల విద్యా అభివృద్ధి, ఇతర సామాజిక పరిస్థితుల అవగాహన కోసం 2003-04 ప్రజాశక్తి దినపత్రికకు చందా ఇస్తూ పెదపెంకి గ్రామ యువతకు, విద్యార్థులకు, ప్రజలకు సహకారిగా ఉన్న జన్ని చింతాడను అభినందిస్తున్నామని ఆయన తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్న యువతకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సిఐ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్

రక్తదానం అభినందనీయం : సిఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని దానాలు కన్నా అన్నదానం, రక్తదానం మహాదానాలన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంత గొప్పదో, ఆపద సమయంలో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడడం కూడా అంతే గొప్పదన్నారు. ప్రిన్సిపల్ టి.శ్రీవరం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను నిలబెట్టేది రక్తమేనన్నారు. విద్యార్థులు, యువత రక్తదానం చేయడం సంతోషంగా ఉందని, యువత నడుం బిగించి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటే దేశం దానంతటదే బాగుపడుతుందని అన్నారు. గుమ్మలక్ష్మీపురానికి చెందిన పలువురు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొని రక్తందానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సిహెచ్‌సి బ్లడ్ బ్యాంక్ డాక్టర్ కె.హరిజగన్, వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాధ, ఎంపిటిసి మల్లేశ్వరరావు, రిటైర్డ్ హెచ్ఎం గుడ్ల హరిప్రసాద్ ఉన్నారు.

చురుగ్గా సాగుతున్న లిడికివలస రోడ్డు పనులు

లిడికివలస రోడ్డు పనులతో గిరిజనుల్లో ఆనందం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని గోచెక్కు పంచాయతీ పరిధిలోని లిడికివలస గిరిజన గ్రామానికి మంజూరైన బిటి రహదారి పనులు పూర్తవుతున్నందున గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చాలా ఏళ్ల గా లిడికివలస నుంచి పార్వతీపురం-దుగ్గేరు ఆర్ అండ్ బి రహదారికి అనుసంధానంగా పక్కా రహదారి నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నప్పటికీ రహదారిల్లేక మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తూ చాలా ఇబ్బందులు పడేవారు. ఏడేళ్ల క్రితం ఈ గ్రామానికి రహదారి కోసం నిధులు మంజూరైనప్పటికీ, పనులు ప్రారంభించక ఆలస్యం జరుగుతూ ఉండేది. ఈ తరుణంలో గ్రామస్తులు ఎంపిటిసి వాటిక సుందరరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును కలిసి సమస్యను వివరించగా, స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి రహదారి పనులు ప్రారంభించారు. ఇప్పుడు పనులు ముగింపు దశకు చేరుకోవడంతో తమ గ్రామానికి బిటి రోడ్డు కలసాకారమైందని, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యేతో పాటు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని గ్రామస్తులు అన్నారు.

కూలి డబ్బులు ఇప్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భూ సర్వే పనుల్లో రాళ్లు పాతిన గిరిజనులకు ఇవ్వాల్సిన కూలి డబ్బులు ఇప్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం గిరిజన కూలీలతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భూ సర్వే పనుల్లో రాళ్లు పాతే పనికోసం మండలంలోని లిడికివలసకు చెందిన సుమారు 50 మంది కూలీలు కొమరాడ మండలంలోని పలు గ్రామాల్లో రాళ్లు పాతే కూలీ పనులు చేశారని తెలిపారు. కూలి పనులు పూర్తి చేసి రెండు నెలలు గడిచినా కాంట్రాక్టర్లు, రెవెన్యూ అధికారులు కూలి డబ్బులుపూర్తి స్థాయిలో చెల్లించలేదని అన్నారు. పది రోజుల క్రితం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశామని, అయినా కూలీ డబ్బులు ఇవ్వలేదని అన్నారు. తక్షణమే కూలీ డబ్బులు చెల్లించాలని లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా కూలి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కూలీలు ప్రశాంత్ కుమార్, సోమేశ్వరరావు, వినోద్ కుమార్, శ్రీనుపాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో గల హడ్కో కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఈ గ్రామంలో ఇటీవల నిర్వహించిన జగనే మళ్లీ ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి గ్రామస్తులు చెప్పిన సమస్యలపై ఆయన స్పందిస్తూ అక్కడికక్కడే 20 నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు కాంట్రాక్టర్ తవిటి నాయుడు, పంచాయతీ ఇంజనీర్ అసిస్టెంట్ పార్వతి, సంతోష్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, వైసిపి నాయకులు వెంకయ్య పనులను పరిశీలించారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలు అరికట్టండి

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఏకైక బ్రిడ్జి సంకిలి బ్రిడ్జి. ఈ బ్రిడ్జి సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరపడం వల్ల బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉంది. గతంలో మైనింగ్ జియోలజీ విభాగాల వారు బ్రిడ్జిలకు సమీపంలో ఇసుక తవ్వకాలు జరపొద్దని పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు హెచ్చరించినప్పటికీ మళ్లీ ఈ బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఈ బ్రిడ్జికి కొన్ని మీటర్ల దూరంలో పాలకొండ డివిజన్ కేంద్రానికి, సమీప ప్రాంతాలకు వెళ్లే తాగునీరుకి సంబంధించిన పంపు హౌస్ ఉన్నది. బ్రిడ్జి సమీప గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు కూడా ఇదే బ్రిడ్జి సమీపంలో నుంచి వెళ్లాల్సి ఉంది. ఇంత ప్రాధాన్యత గల ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరపడం వల్ల నదీ గర్భం కోతకు గురై దిగువునున్న గ్రామాలలోకి వరదల సమయంలో వరద నీరు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి, ప్రజల ప్రాణాలను, ఆరోగ్యాలను కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

నాగావళి నది నుండి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని గోపాలపురం సర్పంచ్ జగదీష్‌తో పాటు గ్రామస్తులు గురువారం నాగావళి నదీ తీరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తవ్వకాల వల్ల వంతెనకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ విషయమై అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకుండా ఉండడం శోచనీయమన్నారు. అలాగే ఈ తవ్వకాల వల్ల తాగునీటి సమస్య ఎదురవుతుందన్నారు. నాగావళి నది నుంచి అనేక గ్రామాలకు నీటి సరఫరా అవుతుందని, అయితే ఈ తవ్వకాల వల్ల నీటి సరఫరాకు కూడా ఇబ్బందులు తప్పవని అన్నారు.

నిరసన తెలుపుతున్న గోపాలపురం సర్పంచి, గ్రామస్తులు

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

సత్యసాయి బాబా 98వ జన్మదినం వేడుకల్లో భాగంగా గురువారం శ్రీ సత్యసాయి సేవా సమితి అధ్వర్యాన భక్తులు నగర సంకీర్తన చేశారు. అనంతరం సమితి సభ్యులు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రిలో ఉన్న పేదరోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. సమితి కన్వీనర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యాన సాయిబాబా మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీతంపేట :సత్య సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా 98వ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోనుబాయి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం కొండగొర్రి సుబ్బారావు సర్వమత పతాకావిష్కరణ చేయగా జిసిసి డిఎం జి.సంధ్యారాణి చేతులు మీదుగా పేదలకు అమృత కలసాలు పంపిణీ చేశారు. వీటిలో నిత్యావసర సరుకులతో పాటు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అమృత కలశాలు బట్టలు పంపిణీకి పూర్వపు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సురేంద్ర, మాజీ ఎమ్మెల్యే నిమ్మక సుగ్రీవు ఆర్థిక సహాయం అందించారు. సేవా సమితి అధ్యక్షులు గొర్లె నరసింహులు, కన్వీనర్ కె.పకీరు నాయుడు, క్రియాశీల సభ్యులు గంటా రామకృష్ణ, శ్రీరాములు, వెంకట్రావు, రమణ, బీమారావు, నాగేశ్వారరావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

సీతంపేట : అన్నదానం నిర్వహిస్తున్న సత్యసాయి కమిటీ సభ్యులు

గోతులు కప్పేశారు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని 27వ వార్డు దంగిడి వీధిలో నిత్యం రద్దీగా ఉంటున్న రహదారిలో తాగునీటి ప్రధాన పైపులైన్ ద్వారా మెరుగైన తాగునీటి సరఫరా చేసేందుకు పరికరాలను అమర్చడంలో భాగంగా తవ్విన గొయ్యిలను కొన్ని నెలలుగా వదిలివేశారు. దీంతో ఈనెల 18న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన తవ్వి వదిలేశారు అన్న వార్తకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి గోతులను కప్పేయడంతో ఆ వార్డు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విష సర్పాలు కలకలం...

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలోని గాంధీనగర్ వీధి దగ్గర విష సర్పాలు కలకలం రేపుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి గాంధీనగర్ వీధికి సమీపంలో లంకెల చెరువు చెత్తాచెదారంతో నిండి ఉండడంతో అందులో ఎక్కువ విషసర్పాలు సంచరిస్తూ వీధుల్లోకి పగలు, రాత్రి అన్న తేడా లేకుండా సమీప ఇళ్ళు, షాపుల్లో సంచరిస్తున్నాయి. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పిల్లలు బయట ఆడుతూ తిరుగుతుంటారని, అలాగే రాత్రి సమయంలో ఏ క్షణాన ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుంటూ బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నామని కావున సంబంధిత అధికారులు చెరువులు పరిశు భ్రపరిచి విష సర్పాలు దాడి నుండి రక్షించాలని కోరుతున్నారు.

న్యుమోనియా పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పిల్లల్లో న్యుమోనియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన అడ్డాపుశీలలో అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ వివరాలు రికార్డులో పరిశీలించారు. పిల్లల్లో శ్వాస సంబంధమైన వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ప్రాణాంతకమైన వ్యాధుల్లో న్యుమోనియా ఒకటని వ్యాధి లక్షణాలు గుర్తిస్తే వెంటనే నివారణా చర్యలు చేపట్టాలని, పిల్లల్లో న్యుమోనియా నియంత్రణకు వైద్యారోగ్యశాఖ సాన్స్ కార్యక్రమం ప్రవేశపెట్టిందని, వైద్య సిబ్బంది సర్వే చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు అక్కడ పిల్లల తల్లిదండ్రులకు, సిబ్బందికి పిల్లల్లో న్యుమోనియా లక్షణాలను ఏవిధంగా సులభంగా గుర్తించవచ్చునో వివరించి అవగాహన కల్పించారు. ఈ లక్షణాల్లో ముఖ్యంగా జలుబు, దగ్గు అధికంగా ఉండి త్వర-త్వరగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునేటప్పుడు పక్కటెముకులు కదలడం, అధికంగా జ్వరం రావడం, శ్వాస తీసుకునే సమయంలో శబ్దం రావడం, ఏమీ తినకపోవడం, తాగకపోవడం, అధికంగా నిద్రపోవడం మొదలగు లక్షణాల ద్వారా గుర్తించవచ్చని అన్నారు. వాతావరణంలో మార్పులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండడం, పౌష్టికాహారం సరిగా తీసుకోని పిల్లల్లో న్యుమోనియా అధికమవుతుందని అన్నారు. న్యుమోనియా నుండి సురక్షితంగా ఉండాలంటే బిడ్డ శరీరాన్ని బట్టలతో పూర్తిగా కప్పి ఉంచాలని, ఇంట్లో పొగలేకుండా చూసుకోవడం, కిటికీలు తెరచిఉంచడం, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోనే ముర్రుపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. వైద్య, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేసి పిల్లల్లో న్యుమోనియా నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం శాంతి కుమారి, అంగన్వాడీ సిబ్బంది శ్రీ లక్ష్మి, అలివేలు, ఆశా కార్యకర్తలు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూచనలు వివరిస్తున్న డిఐఒ జగన్మోహన్

గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలను అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి వ్యక్తి వారి వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సింగపూర్ రెడ్‌క్రాస్ బృందం సభ్యులు డేనియల్ అన్నారు. మండలంలోని గిరిశిఖర గ్రామాలైన సిరికొండ, వాడకొయ్య, పొక్కిరిగూడ గిరిజన గ్రామాల ప్రజలకు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో 300 మంది గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలు, సబ్బులను సింగపూర్ రెడ్ క్రాస్ బృందం గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పి.కొండలరావు, వై.జనార్ధన్‌రావు, కొత్తకోట లక్ష్మణరావు, బి.వెంకటరమణ, గిరిజనులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సోమగండి అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి గురువారం సందర్శించారు. గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం ఎలా అందుతుందో పరిశీలించారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. పిల్లలకు ఆటపాటలతో విద్యను అందించాలన్నారు. ప్రజలకు రోజుకు ఎన్ని సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఎంపిడిఒ సూచించారు.

ఎల్ఎన్ పురంలో 'జగనన్న మళ్లీ ఎందుకంటే'

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఎల్ఎన్ పురంలో గురువారం జగనేఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైసిపి జెండాను ఎగురవేసి అనంతరం ఆ గ్రామానికి వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన నిధుల పట్టికను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, నాగేశ్వరరావు, ఎంపిపి మజ్జి శోభారాణి, ఇఒపిఆర్‌డి కృష్ణుడు, సర్పంచి జక్కు ప్రవీణ్ కుమార్, ఎంపిటిసి సభ్యులు బంకురు రవికుమార్, మండల వైసిపి కన్వీనర్ బొమ్మి రమేష్, నాయకులు కొత్తాడ నాగభూషణరావు, వెంపల గురురాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచితగ్యాస్ కనెక్షన్లు పంపిణీ

మక్కువ : మండల కేంద్రంలో హెచ్‌పి గ్యాస్ గోడౌన్ ఆవరణలో అర్హత కలిగిన మహిళలకు గురువారం ఉచిత గ్యాస్ కనక్షన్ల పంపిణీ జరిగింది. మండల టిడిపి సీనియర్ నాయకులు మామిడి ప్రసాదరావునాయుడు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 120మందికి ఈ ఉచిత గ్యాస్ కనక్షన్లను పంపిణీ చేశారు. కేంద్రప్రభుత్వం నిరుపేదలు, తెలుపు రేషన్ కార్డు కలిగిన మహిళలకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనక్షన్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలు ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటు వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ పి.మల్లేశ్వరరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గౌరీశంకరరావు, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలుకు కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్దిదారునికి చేరేలా పగడ్బందీగా అమలుకు కృషి చేస్తున్నామని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. శనివారం తన కార్యాలయంలో 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 14 వరకు విజయవంతంగా నిర్వహించామన్నారు. మండలంలోని పెదరామ సచివాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డు కార్యక్రమం ఈనెల 9 నుండి ప్రారంభించామని, ప్రతి సచివాలయంలో సంక్షేమ పథకాలు పట్టికలో లబ్దిదారులకు అందించిన సేవల వివరాలు పారదర్శకంగా జరిగేలా ఆ బోర్డులో దర్శనమిస్తాయని తెలిపారు. ఈనెల 27 నుంచి కులగణన సర్వే వారం రోజులు పాటు నిర్వహిస్తామని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వాలంటరీ యాప్‌లో వివరాలు పొందుపరుస్తారని తెలిపారు. సర్వేకి ప్రజలు సహకరించాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. వివరాలు ఏ పథకాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 10 నుంచి జనవరి 5 వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మొబైల్ వ్యాన్ ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పథకాల అమలుపై అవగాహన, లబ్ధిదారుని పురోగతిని గుర్తించి, అందుతుందా లేదా మొబైలు వ్యాను ప్రతి పంచాయతీకి వెళ్తుందని తెలిపారు. డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర జనవరి 4 వరకు జరుగుతుందని చెప్పారు. అలాగే సచివాలయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రజలకు అనేక సేవలు అందించాలని అందుబాటులో ఉండాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించామని తెలిపారు. ఏజెన్సీలో ఉపాధి హామీ పనులు పగడ్బందీగా అమలుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పనులు జరిగే చోట అన్ని సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షిస్తున్నామని, వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

కరువు ప్రాంతంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి ప్రభుత్వం, ఎమ్మెల్యేలు కరువు ప్రాంతంపై దృష్టిసారించి రైతులను ఆదుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మక సింహాచలం కోరారు. గిరిజన ప్రాంతంలో ఫిష్ ఆంధ్రతో గిరిజన యువతకు ఎటువంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. ఫిష్ ఆంధ్ర సముద్రపు ప్రాంతాల సమీపాన ఏర్పాటు చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుంది తప్ప ఈ ప్రాంతంలో గిరిజన యువతకు ఎటువంటి ఉపాధి, ఉపయోగం ఉండదని స్పష్టం చేశారు. సకాలంలో వర్షాలు కురవక గిరిజన ప్రాంతంలో వరి పంట పూర్తిగా పాడైందని, కరువు కోరల్లో రైతులు చిక్కుకొని ఆందోళన చెందుతున్నా ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నష్టపోయిన పంటపై సర్వే చేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో వందలాదిమంది నిరుద్యోగ యువత ఉన్నారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల అవుతున్నా ఒక్క డీఎస్సీ కూడా నేటి వరకు తీయలేదన్నారు.

ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగన్నాథరావు తెలిపారు. ఎయిడ్స్, హెచ్‌ఐవిపై అవగాహనలో భాగంగా గురువారం ఆర్‌సిఎం ప్రాంగణంలో పోటీలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. మొదటి బహుమతి టి.ప్రణీత, రెండవ బహుమతి పి.మల్లికా, మూడో బహుమతి ఎం.శ్రావ్య గెలుచుకోగా కన్సోలేషన్ బహుమతులను శ్రీలేఖ, సాయిశ్రీ గెలుచుకున్నారు.

హెపటైటీస్ బి, సి పరీక్షలు

స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఎఆర్‌టి సెంటర్‌లో హెపటైటీస్ బి,సి పరీక్షలను గురువారం నిర్వహించారు. నెగిటివ్ వచ్చిన వారికి వ్యాక్సినేషన్ కార్యక్రమంను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రతి గురువారం జరుగుతుందని, జిల్లా ప్రజలు ముఖ్యంగా హైరిస్క్ గ్రూపులో ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, ఎం.సాక్షి గోపాలరావు, కౌన్సిలర్ కష్ణమూర్తి, ప్రాజెక్టు మేనేజర్ ఎల్.శ్రీకాంత్‌బాబు సిబ్బంది, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

జిసిసి డిపోల పరిధిలో గల కార్డుదారులకు రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని బ్రాంచ్ మేనేజర్ జె.రామారావు కోరారు. గురువారం ఆయన జిసిసి కార్యాలయంలో సాలూరు, మక్కువ, పాచిపెంట, మెంటాడ, రామభద్రపరం మండలాలకు డిఆర్ డిపో సేల్స్‌మేన్లు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోల పరిధిలో ఉన్న రేషన్ కార్డులకు నిర్దేశించిన గడువులోగా సరుకులు ఎండియు ఆపరేటర్ల ద్వారా అందించాలన్నారు. సకాలంలో సరుకులు అందించని సేల్స్ మేన్లు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గిరిజన గ్రామాల్లో గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. డిపోల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సేల్స్‌మేన్లు, డీలర్లు చేరుకోవాలని మేనేజర్ రామారావు ఆదేశించారు. కార్యక్రమంలో అకౌంటెంట్, సేల్స్ మేన్లు, డీలర్లు పాల్గొన్నారు.

మార్కొండపుట్టిలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పెదఘాశిలలో గురువారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల పశువైద్యాధికారి కె.పొలందొర సుమారు 50 పశువులకు కృత్రిమ గర్భధారణ చేసి గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. వంద జీవాలకు నట్టు వ్యాధి రాకుండా మందును పంపిణీ చేశారు. పశువులున్న రైతులకు ఆరోగ్య సంరక్ష కార్డులను అందించాలని సిబ్బందికి సూచించారు. శీతాకాలంలో పశువులను గురించి పశు విజ్ఞాన సదస్సును నిర్వహించి పశు యజమానులకు అవగాహన కల్పించారు. పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అజాగ్రత్తగా వ్యవహరించకుండా వెంటనే తమ సిబ్బందికి తెలియజేయాలని, టీకాలు, నట్టలనివారణ మందులను తప్పకుండా వాడాలని రైతులకు పశువైద్యాధికారి సూచించారు. అనంతరం పశువులకు అవసరమైన మందులను స్థానిక ఎంపిటిసి సభ్యులు భాగ్యలక్ష్మి చేతుల మీదుగా రైతులకు అందించారు. కార్యక్రమంలో స్థానిక విఎఎ సాయిలక్ష్మి, గోపాలమిత్ర కుప్పిలి సోమశేఖర్ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మందులను అందజేస్తున్న ఎంపిటిసి సభ్యులు భాగ్యలక్ష్మి